క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఉత్సాహంగా 'మ్యాథ్‌మ్యాట్రిక్స్-2025'



అతిథులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

కంచరపాలెం: విద్యార్థుల్లో మేధా కౌశలాన్ని, అంతర్గత ప్రతిభా పాటవాలని ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల గణిత పోటీలు ఎంతో దోహదపడతాయని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శుక్రవారం గణిత విభాగం, గణాంక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మ్యాథ్ మ్యాట్రిక్స్-2025 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమగ్ర విద్య లెక్చరర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ద్వితీయ భాషల పూర్వాధిపతి డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, ఏయూ గణిత ఆచార్య శర్మ మాట్లాడారు. నగరంలో పలు కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు క్విజ్, సుడోకో, మైండ్ మేస్, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కెప్టెన్ కె.సుజాత, కె.కె. సౌజన్య, జి.యోజన, లక్ష్మి, ఎస్.శ్రీరామ్, గౌరీశంకరరావు, సునీత చౌదరి, వి.భారతి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకారం



ఐక్యత చాటుతున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పాతనగరం టౌన్‌హాల్ వద్ద ఉన్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి మాత చిత్రపటాలకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ పాల్గొని నూతనంగా ఎన్నుకున్న సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి పాటోజు రామకృష్ణ నాని, కోశాధికారి కర్రి రాజశేఖర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ గోడి నరసింహాచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, సంఘం ప్రతినిధులు మారోజు ఆచారి, డొంక నానాజీ, గుంటుపల్లి ప్రసాద్, శివకోటి శ్రీనివాసరావు, గిడిజాల పార్వతీశం, కర్రి వెంకటేశ్వరరావు, బంగారు సురేష్, గురజాపు రవి, పందూరు శేఖర్, కర్రి విశ్వం, ధర్మవరపు వరం బాబు, పోలవరపు శ్రీను, పాటోజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు బహుమతులు

మహారాణిపేట: జిల్లా స్థాయిలో నిర్వహించిన జానపద నృత్య పోటీలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థిని బి.సునీత గ్రూప్‌నకు ద్వితీయ బహుమతి, ప్రవల్లిక గ్రూప్‌నకు గీతాలాపనలో ద్వితీయ బహుమతి లభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. విజేతలను ప్రిన్సిపాల్, కాలేజీ కల్చరల్ కమిటీ కన్వీనర్ బి.రాధమ్మ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



వన్‌టౌన్‌లోని వైజాగ్ సెంట్రల్ వద్ద..



పోర్టు ముఖ ద్వారం వద్ద సెంట్రల్ మీడియన్

ప్రారంభం ఘనం.. నిర్వహణ శూన్యం

- నిర్లక్ష్యానికి గురవుతున్న సెంట్రల్ మీడియన్లు
- పాతనగరంలో పలుచోట్ల ఇదే పరిస్థితి
- అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికుల వినతి

జగదాంబ: నగర అందాన్ని ఇనుమడింపజేసే చర్యల్లో భాగంగా జీవీఎంసీ పలు రహదారుల మధ్యలో సెంట్రల్ మీడియన్లు ఏర్పాటు చేసింది. అందమైన మొక్కలు, పూలతో అవి ఒకప్పుడు కళకళలాడేవి. ప్రజలు, పర్యాటకులు ఆ అందాలు వీక్షించి పరవశులయ్యేవారు. అయితే అదంతా గతం.. ఇప్పుడు అవే సెంట్రల్ మీడియన్లను చూస్తే మనస్సు చివుక్కుమంటుంది. చాలా చోట్ల మొక్కలు ఎండిపోయాయి. పూలు పూయడమే మానేసాయి. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలోని పలు చోట్ల ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. మొదట్లో ఉన్న ఉత్సాహం తర్వాత కొరవడడంతో పాపం సెంట్రల్ మీడియన్లు దిక్కులేనివి అయిపోయాయి.

అస్తవ్యస్తం..

జీవీఎంసీలో హార్టీకల్చర్ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ మీడియన్ పనులు జరిగాయి. సెంట్రల్ మీడియన్లలో చక్కగా పెరిగిన మొక్కల ఆకృతిని బట్టి వాటిని వివిధ రూపాల్లోకి మలచడం, అవి గుబురుగా ఒకే చోట పెరిగిపోకుండా నలువైపులా విస్తరించేలా చేయడం వంటి పనులు ఆ విభాగం చూసుకునేది. తొలుత కొన్నాళ్లు నిర్వహణ బాగానే ఉన్నా తర్వాత విస్మరించడంతో అందం కోసం వేసిన సెంట్రల్ మీడియన్లు కాస్త అందవిహీనంగా మారాయి. ఆకులు రాలి, మొక్కలు కుళ్లి, పెరిగిన గడ్డితో అంతా అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

పాతనగరంలో..

జగదాంబ, డాల్ఫిన్ ఏరియా, విశాఖ సెంట్రల్, 75 ఫీట్ రోడ్డు, మున్సిపల్ స్టేడియం, జనతాబజార్, పోర్టు దరి సీహార్స్ జంక్షన్ తదితర ప్రాంతాల్లోని సెంట్రల్ మీడియన్లలో మొక్కలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అవి ఎండిపోయి అదృశ్యమైపోయాయని, అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్..

సెంట్రల్ మీడియన్‌లో పచ్చదనం నిర్వహణపై ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆరా తీశారు. సెంట్రల్ మీడియన్లలోని మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటాలని, రోజూ మొక్కలకు నీరు పోయాలని, ఎదిగిన మొక్కలను అందంగా ట్రిమ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే వాటిని కూడా అధికారులు బేఖాతర్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



జగదాంబ వద్ద..

చర్యలు తీసుకుంటాం...



జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న సెంట్రల్ మీడియన్లను పరిశీలిస్తున్నాం. జగదాంబ, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో రోజు మొక్కలకు నీళ్లు పోస్తున్నారు. అలాగే అన్ని ప్రాంతాల్లోను సెంట్రల్ మీడియన్లను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించాం. ఎక్కడైనా నిర్వహణ సజావుగా లేకపోతే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జోన్-4 కమిషనర్

బాధితులకు న్యాయం చేయాలి

డాబాగార్డెన్స్: రామ్‌నగర్ భానోజీనగర్‌లో నివాసం ఉంటున్న ధనాల పైడితల్లి పెద్ద కుమార్తె నిహారికను బంగారు సూర్య వెంకట్రావు, అతని కుమారులు సంతోష్, ప్రసాద్, పద్మ (నలుగురు కలిసి) దౌర్జన్యంగా ఇంట్లో బంగారం, వెండి, డబ్బుతో తీసుకుపోయారని సిటు నాయకుడు వై.రాజు తెలిపారు. శుక్రవారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా టూటౌన్ పోలీసులు బాధితులకు న్యాయం చేయాలని, బంగారం, వెండి, డబ్బు రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. లేనిచో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతుందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఎం.సుబ్బారావు, నర్సింగరావు, చంద్రశేఖర్, బాధితులు పాల్గొన్నారు.

దృష్టి లోపం గల విద్యార్థుల కోసం ఆధార్ సేవలు

మహారాణిపేట: ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ (గరల్స్) ఎండాడ విద్యార్థుల కోసం రెండు రోజుల పాటు ఆధార్ నమోదు, నవీకరణ కార్యక్రమం నిర్వహించామని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. దృష్టి లోపం గల బాలికల పాఠశాలలో ఆధార్ బృందం మొత్తం 24 మందికి ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్ నిర్వహించారన్నారు. అన్ని వర్గాల వారికి ఆధార్ సేవలను విస్తరించాలని పోస్టల్ శాఖ నిరంతరం ప్రయత్నాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని పోస్టల్ అధికారులు తెలిపారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ కానివ్వం



వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కోటి సంతకాల సేకరణ కరపత్రాలు అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

- కోటి సంతకాల ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రజల కోసం నిర్మించిన మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ కానివ్వకుండా అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆశీల్‌మెట్ట కార్యాలయంలో పార్టీ శ్రేణులకు కోటి సంతకాల సేకరణ ఉద్యమ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి పేదలు వైద్యులు కావాలన్న సంకల్పం, పేదలకు మెరుగైన వైద్యం అందివ్వడం కోసం నిర్మాణం చేపట్టిన 17 కాలేజీలను చంద్రబాబు తొత్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశాన్ని అబద్ధంగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల హయాంలో 54 వేల పోస్టుల భర్తీ, రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం, రూ.10,032 కోట్లతో విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు, 105 రకాల మందులు, అక్కడే 14 పరీక్షలు జరిగేవన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా నిర్మించలేకపోయారన్నారు. పైగా జగనన్న చేసిన అభివృద్ధిని నేలమట్టం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జగనన్నతోనే పేదలకు న్యాయం జరుగుతుందని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, రాష్ట్ర, జిల్లా నాయకులు, దక్షిణ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

డాబాగార్డెన్స్: విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పీస్ రేట్ విధానంలో పని చేస్తున్న మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్‌రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో గత కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా, సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మె బాట పట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం (సర్కిల్ ఆఫీస్) వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్.సత్యారావుతో, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకుడు శ్రీనివాస్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

అధికారులూ.. అలసత్వం వీడండి



నగర సుందరీకరణకు చేపడుతున్న పనులు వాహన చోదకులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు, చెట్ల కొమ్మలను నరికి రోడ్ల మీదే పడేస్తున్నారు. అవి గాలికి ఎగిరి రహదారుల మధ్యలోకి వచ్చేస్తున్నాయి. కత్తిరించిన కొమ్మలను వెంటనే తరలించకుండా రోజుల తరబడి రోడ్ల మీదే ఉంచేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పేదల కలను ఖూనీ చేసిన కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి
- 27వ వార్డులో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం



సంతకాల సేకరణ చేపడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్, కొండా రాజీవ్‌గాంధీ తదితరులు



అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న వాసుపల్లి, పార్టీ శ్రేణులు

డాబాగార్డెన్స్: డాక్టర్ కావాలనే పేదల కలను నిజం చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి ముందుకు వస్తే.. కక్ష సాధింపుతో కూటమి ప్రభుత్వం వారి బినామీ అయిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దుయ్యబట్టారు. 27వ వార్డులో దక్షిణ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శుక్రవారం కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా అందాల్సిన నాణ్యమైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేసిందని వాసుపల్లి మండిపడ్డారు. మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయితే జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో చంద్రబాబు బినామీలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం వారికి ఈ మెడికల్ కాలేజీలను కట్టబెట్టడం కోసమే వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీలు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం లూలూ వంటి కంపెనీలకు కారు చౌకగా భూములు దోచిపెడుతుందని, 99 పైసలకు భూములు తీసుకున్న ఉర్సు కంపెనీ కనీసం భూమిని చూడడానికి కూడా విశాఖపట్నం రాలేదన్నారు. భవిష్యత్ తరాలకు భూమి లేకుండా బినామీ సంస్థలకు వేలాది కోట్ల భూములు పప్పు, బెల్లంలా కూటమి ప్రభుత్వం కట్టబెడుతుందని వాసుపల్లి ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్ములారా.. మన్నించండి..

జీవీఎంసీ 27వ వార్డులో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా వాసుపల్లి గణేష్‌కుమార్ డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ములారా మన్నించండి అంటూ పార్టీ శ్రేణులు వినూత్న నిరసన చేపట్టారు. పేదలకు అందాల్సిన సంక్షేమం, అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. విశాఖ భూములు కూడా చంద్రబాబు బినామీలు, బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తూ, పేదలకు గజం భూమి కూడా లేకుండా చేస్తున్నారని వాసుపల్లి ధ్వజమెత్తారు. పేదల హక్కులు కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ శ్రేణులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

జగదాంబ: స్వామి వివేకానంద సంస్థలో రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధిమక్సూద్ అహ్మద్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు మూడు వందల మందికి వారం రోజుల ప్రత్యేక వంటకాలతో అన్నదానం నిర్వహించామన్నారు. గోషా ఆస్పత్రి పేషెంట్లు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, భూమన్, రవివర్మ, ముకుంద్ హోలాని, అజిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌లో ఉచిత శిక్షణ కోసం యువత నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంటు డైరెక్టర్ ఎస్‌పీఎస్ఎస్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన వారికి ఈ కోర్సులో 2 నెలలు శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఇతర వివరాలకు 8500502395 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు.

22 నుంచి మహా అన్న ప్రసాద వితరణ మహోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అల్లిపురం : శ్రీహరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు మండల కాల మహా అన్న ప్రసాద వితరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకట రమణమూర్తి తెలిపారు. వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ఏ మాలనైనా ధరించి దీక్షలో ఉన్న భక్తులకు సుచికరం, రుచికరమైన మడితో వండిన భోజనం అందించేందుకు సంకల్పించామని చెప్పారు. ఈ బృహత్తర అన్నదాన కార్యక్రమానికి విశాఖలోని ఆధ్యాత్మిక మహాశయులు, అయ్యప్ప స్వామి భక్తులు సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరారు. భక్తి భావంతో బియ్యం, పప్పు దినుసులు, కాయగూరలు వంటివి స్వీకరిస్తామన్నారు. ఎవరైనా భక్తి భావంతో సమర్పించే విరాళాలు శ్రీ హరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం పేరున అందించి, రసీదు పొందవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో శ్రీ కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు కె. కోటీశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు, గురుస్వామి కడగల శ్రీను, ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కె. సుబ్రహ్మణ్యం, కె. శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, పి.అవతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పూలకుండీ.. రక్షణ కోసమండి!



వెలంపేట మెయిన్ రోడ్డులో మ్యాన్‌హోల్ పైకప్పు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనాలు వెళ్తే పూర్తిగా విరిగి పడిపోయే పరిస్థితులు ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేయకుండా జీవీఎంసీ అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో స్థానికులు దానిపై నుంచి ఎవరూ వెళ్లకుండా పూల కుండీ ఉంచిన దృశ్యం.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు

కంచరపాలెం: సమాజంలో సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నందున యువత జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు 9440796019 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఇన్‌చార్జి డాక్టర్ సుజాత, కృష్ణకుమారి, పి.కె.జయలక్ష్మి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.